**International Journal of Academic Research**
**ISSN: 2348-7666; Vol.7, Issue-7(1), July, 2020**
**Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in**

# MOVEMENT FIGHTERS OF TRIBAL ENLIGHTMENT IN SRIKAKULA KAVYAM
# (శ్రీకాకుళ కావ్యంలో ఆదివాసీ చైతన్య ఉద్యమకర్తలు)

**Dr.Pulaparthi Srinivasarao**
MA(Tel),MA(Skt),MA(P-ad),B.Ed.,Ph.D.
Department of Telugu
Andhra University
Visakhapatnam-03
Andhra pradesh

**సంక్షిప్త పరిచయం:**

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను కలిపి ఉత్తరాంధ్రగా వ్యవహరిస్తారు. ఆంధ్రరాష్ట్రంలో ఇది ప్రత్యేకతలు కలిగిన ప్రాంతం. అయితే అభివృద్ధిలో అన్నిరంగాలలో వెనకబాటులో ముందున్న ప్రాంతం కూడా ఇదే. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక ఆదివాసీలు ఉత్తరాంధ్రలోనే ఉన్నారు. ఎక్కువ గిరిజన జనాభ కలిగిన ఈ ప్రాంతంలో ప్రాకృతికమైన సంపద ఎంత ఉన్నా, వినియోగం మాత్రం తక్కువ. దీనికి అనేక కారణాలున్నాయి. బ్రిటీషు పాలనా కాలం నుండి గిరిజనులపే అనేక చట్టాలు చేసి, వారిని అణచివేతకు గురిచేస్తున్నారు. వారు జీవించే హక్కులను పరోక్షంగా కాలరాస్తున్నారు. ఇలాంటి వారి కోసం ఎందరో ఉద్యమకర్తలు వారి పక్షాన పోరాడి అసువులుభాసిన దాఖలాలున్నాయి. వారు వెలువరించిన సాహిత్యం గిరుజనులను ఎంతగానో చైతన్యం చేయడంతోపాటు, వారిజీవన విధానం గురించి సామజంలో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. అటువంటి వారి గురించి తెలియజేసేదే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

ఉత్తరాంధ్ర రచయితల్లో గిరుజనుల పక్షాన ఉండి, సాహిత్యంతో చైతన్యం చేస్తున్న వారు చాలామందే ఉన్నారు. వీరు వెలువరించిన సాహిత్యంలో కూడా గిరిజన పక్షపాతులను గురించి చాలా సందర్భాలలో ప్రస్తావించారు.

**గిరిజన ఉద్యమ చైతన్యతారులు:**

**1.వెంపటాపు సత్యం :**

మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన సత్యం 8వ తరగతి వరకు చదువు కున్నాడు. ఇతని అసలు పేరు వెంపటాపు సత్యనారాయణ. టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని 1952 సంవత్సరం నుండి గొయిపాక, ఏగులవాడ, కొండబారిడి మున్నగు ఏజన్సీ గ్రామాల్లో టీచర్‌గా పనిచేశాడు. గిరిజన ప్రాంతాలన్నింటిపై పూర్తి అవగాహన ఉన్నందున వారి జీవితాలను క్షుణ్ణంగా అర్థం చేసుకున్నాడు. అమాయక గిరిజనుల జీవితాలకు ఒక దారి చూపాలని నిర్ణయించుకుని దాని కోసం ప్రయత్నిస్తుంటాడు. గిరిజనులను సంఘటిత పరిచి వారికి జరుగుతున్న అన్యాయాలు, దోపిడీలను గురించి తెలియజెప్పి వారిని దోచుకుంటున్న వారిపై తిరుగుబాటు చేసే విధంగా మలిచి, గిరిజన గూడేలలో సంఘాలేర్పాటు చేసి భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, షావుకార్లపై తిరుగుబాటు చేయించాడు.

సత్యం మాష్టారు గొప్ప విప్లవ నాయకుడే కాకుండా మంచి కవి కూడా. 1958లో ప్రారంభమైన గిరిజనోద్యమ అవసరంగాను, పార్టీ సందేశాన్ని గిరిజనులకందించడానికిగాను వారికి సులువుగా అర్థమయ్యేందుకు పాటల రూపంలో ప్రబోధం చేయడానికి గేయ కవితలను రాశాడు.

"కండ బిగువు కలిగినట్టి కొండజాతి వీరుడా!
ఉప్పెన వలె ఒక్కసారి లేచి ముందుకురకరా"(శ్రీకాకుళం ఉద్యమ కావ్యం: పుట - 121)

అని గిరిజనులకు తమ కర్తవ్యాన్ని సులువుగా అర్థమయ్యే పాటల రూపంలో పాడి వినిపించి వారిని చైతన్యవంతుల్ని చేశాడు.

గిరిజనులకోసం తన జీవితాన్ని అర్పించిన సత్యం అనితర సాధ్య మైన విప్లవ నాయక లక్షణాలను అనతికాలంలోనే కలిగి గిరిజనుల తరపున పోరాడాడు. భూస్వాముల గుండెల్లో గుబులు పుట్టించిన సత్యంను వ్యవసాయ

విషయమైన సంప్రదింపులు జరపడానికి పిలిచి చంపాలని చూసిన భూస్వాముల కుట్ర భగ్నమైంది. ఈ విషయాన్ని ఛాయరాజ్‌గారు శ్రీకాకుళ ఉద్యమ కావ్యంలో ఇలా తెలిపారు-

"వలనెత్తుకు పోతోన్న పక్షుల పని పట్టలేక
మాటునున్న వేటగాడు చతికిల బడిపోయాడు
మాటేసిన మడక వదలి ఏనుగులు అలా వెళుతుంటే
ఏడ్వలేక మాపటేడు నీళ్ళ నమిలి మింగాడు"(శ్రీకాకుళం ఉద్యమ కావ్యం:పుట - 48)

సత్యం తన స్నేహితుడైన ఆదిభట్ల కైలాసంతో కలిసి పార్వతీపురం ఏజన్సీలో విశ్రాంతి తీసుకొంటుండగా గిరిజన ద్రోహి అయిన ఒయిక నారాయణ పోలీసులకు వీళ్ళ ఉనికిని తెలపగా 1970 జులై 10న పోలీసుల కాల్పుల్లో సత్యం, కైలాసాలు చనిపోయారు.

**2.సుబ్బారావు పాణిగ్రాహి :**

వృత్తిరీత్యా పూజారిగా ఉంటూ కమ్యూనిష్టుల నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా రైతు పోరాటాలు జరుగుతుండేవి. ఈ ఉద్యమాల ప్రభావం 'బారువా కమ్యూనిష్టు పార్టీ' జిల్లా కార్యదర్శియైన గంటి రాజేశ్వరరావుగారి ప్రభావంతో రైతు పోరాటంవైపు ఆకర్షితుడైయాడు. ఆ తరువాత పలాస సమీపంలో బొడ్డుపాడుకు ఉద్యమ కార్యకర్తగా వచ్చి ఆలుపెరుగకుండా పని చేయడం ప్రారంభించాడు. పాణిగ్రాహి రచయిత కావడంవల్ల పౌరాణిక గాథలను విప్లవాత్మకంగా మలిచి, హరికథల రూపంలో గిరిజనులకు చెప్పేవాడు. ఇటువంటి దృక్పథంతో అతివాద విప్లవబాటలో వీరయోధుడుగా నిలిచాడు పాణిగ్రాహి.

"సోంపేట పూజారి సుబ్బారావు పాణిగ్రాహి
పోరాటానికి నాయకుడైనాడు ................"(శ్రీకాకుళం ఉద్యమ కావ్యం - ఛాయరాజ్ - పుట - 91.)

అని ఛాయరాజ్‌గారు పాణిగ్రాహి గురించి శ్రీకాకుళ ఉద్యమకావ్యంలో వర్ణించాడు. "పాలక వర్గానికంతా పతనం అతి చేరువాయె" అని అంటూ రైతుల్ని కూడగట్టి గరుడభద్ర భూస్వామికి 'మరణ దండన' విధించి ఉద్దానం ప్రాంత రైతాంగాన్ని ఉద్రేకంలోకి ఊపేశాడు. ఈ విధంగా పెన్నుతో పాటు గన్నును కూడా పట్టి శ్రీకాకుళ పోరాటంలో అమరుడైనాడు సుబ్బారావు పాణిగ్రాహి.

**3.ఆదిభట్ల కైలాసం :**

పార్వతీపురం తాలుకా, కారివలస అనే గ్రామంలో పెద్దబుగతల కుటుంబంలో కైలాసం జన్మించాడు. టీచర్ ట్రైనింగ్ చేసిన కైలాసం ఆ కాలంలో జరుగుతున్న గిరిజన రైతాంగ పోరాటం బాగా ఆకర్షించింది. సాగు చేసే వారిదే భూమిపై హక్కు అని, అగ్రహారికులకు కౌలు ధాన్యం కొలవనవసరంలేదని రైతులను సంఘటిత పరిచాడు. ఇలా తనకు పెదమేరంగిని కేంద్రంగా చేసుకొని రైతు సంఘాలను నిర్మించాడు. సత్యం అనుసరించిన మార్గంలోనే ఉద్యమాల్ని నడుపుతూ భూస్వాముల గుండెల్లో భయాన్ని కలిగించాడు. విప్లవ నాయకుడు ఆదిభట్ల కైలాసం.

ఆరికి కోరన్న - కొండ గొర్రి మంగన :

పార్వతీపురానికి చెందిన కోరన్న, మంగన్న సత్యం మాష్టారు నాయకత్వంలో మొండెంఖల్లులో జరుగుతున్న గిరిజన రైతు సభలకు పలు ప్రాంతాల్లో ఉన్న గిరిజనులందర్నీ ఏకంచేశాడు,

"గుండెల్లో ఉత్సాహాన్ని నింపి పెడుతూ ముందు నడుస్తూ
ఆరిక కోరన్నా కొండగొర్రి మంగన్నా
శూరులుగా సూరీళ్లుగా సంఘ కార్యకర్తలుగ
గిరిజనులను కూడగడుతూ జాడపెడుతూ ..........."(శ్రీకాకుళం ఉద్యమ కావ్యం:పుట - 64.)

అంటూ తీసుకెలుతుండగా 1967 అక్టోబరు 31లో ఎల్విన్‌పేటకు చెందిన భూస్వామి మేడిద సత్యం గూండాలతో వీరిని అటకాయించగా భయభ్రాంతులై సమీప గూడేల్లోకి, అడవుల్లోకి పారిపోగా మిగిలిన కోరన్న - మంగన్నలను గూండాలతో కొట్టించి చంపించాడు.

కోరన్న - మంగన్నలు చిందించిన రక్తంలోంచి శ్రీకాకుళం పుట్టిందంటూ రచయిత -

"భూస్వామ్యానికి నూకలు చెల్లించే కార్యక్రమాన్ని
ఆచరించి కోరన్న మంగన్నలు
చిందించిన రక్తపు జల్లుల వెదజల్లుల లోంచి
శ్రీకాకుళం ......................................................"(శ్రీకాకుళం ఉద్యమ కావ్యం :పుట - 65)

**4.రాములు మాష్టారు :**

పార్వతీపురం ఏజన్సీ ప్రాంతంలో వున్న గ్రామంలో ఒక సామాన్య కుటుంబంలో రాములు మాష్టారు జన్మించారు. ఏజన్సీలో ఉన్న గిరిజనుల్ని భూస్వాములు, వ్యాపారులు, షావుకార్లు దోపిడీ చేయటాన్ని, ఈ గిరిజనుల జీవితాల్లో ఉన్న విషాదాన్ని చూసి, చలించి వారిని సంఘటిత పరచి ఏ రాజకీయ సిద్ధాంత ప్రసక్తిలేకుండానే గిరిజనుల చేత ఉద్యమం చేయించిన మొదటి వ్యక్తి రాములు మాష్టారు.

రాములు మాష్టారు చేస్తున్న పోరాటాన్ని చూసి చలించిన వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం మొదలైనవారు కమ్యూనిస్టు ప్రభావంతో ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. చివరికి నక్సల్బరి ఉద్యమ నాయకుడైన చారుమజుందార్ యొక్క రాజకీయ పోరాట పంథాను అనుసరించి శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటాన్ని సాయుధపోరాటంగా మలిచారు.

**5.తరిమెల నాగిరెడ్డి :**

'టి.యన్.'గా ప్రసిద్ధులైన ఈయన శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటంలో పాల్గొని గిరిజనులకు న్యాయం చేయాలని ప్రయత్నించారు. అందుకే శ్రీకాకుళ గిరిజనోద్యమంలో అతివాదాన్ని, చారుమజుందార్ పోరాట పంథాని టి.యన్. గారు పూర్తిగారు పూర్తిగా వ్యతిరేకించారు. టి.యన్.ను గురించి పరిశీలిస్తే,

"బిక్కపోయిన ప్రజలను అక్కున చేర్చుకొనేందుకు
నష్టపడిన శ్రీకాకుళం వేపు నడిచాడు కామ్రేడ్ నాగిరెడ్డి
క్షతగాత్రులైన ప్రజలకు అభయమిచ్చేందుకు
గాయపడిన శ్రీకాకుళం వేపు నడిచాడు తరిమెల నాగిరెడ్డి"(శ్రీకాకుళం ఉద్యమ కావ్యం: పుట - 111)

శ్రీకాకుళం ఉద్యమ పోరాటం అతివాద దశలో పడి సర్వం నాశనమౌతున్న తరుణంలో శ్రీశ్రీతో కలిసి టి.యన్.గారు శ్రీకాకుళ ప్రాంతాన్ని పర్యటించి అతివాదంతో దెబ్బతిన్న ఉద్యమ ప్రాంతాలను తట్టిలేపి ఓదార్చారు.

తామాడ గణపతి :

పలాస దగ్గర్లో గల బొడ్డపాడు గ్రామ నివాసి అయిన గణపతి ఉద్దానం ప్రాంతంలో ఉన్న గిరిజన రైతాంగాన్ని కూడగట్టి బాతుపురం, గరుడభద్ర మున్నగు ప్రాంతాల్లోని భూస్వాములపై మారణాయుధాలతో దాడి చేయించి వారి ఆస్తుల్ని స్వాధీనపర్చుకున్నారు. ఉద్ధానం ప్రాంతంలో సాగుతున్న శ్రీకాకుళ ఉద్యమానికి మొదటిసారిగా రక్తపాత రుచి చూపించిన వ్యక్తి గణపతి.

**6. ఆరిక రెంజిమ్ :**

గిరిజనులకు పోలీసులకు మధ్య జరుగుతున్న పోరాటంలో అతివాదులు దుందుడుకుతనంతో పోలీసుల్ని, పోలీసు ఏజెంటుల్ని చంపి వారి వద్ద నుండి తుపాకుల్ని చేజిక్కించుకొని మొదటిసారిగా పోలీసులపై ఎదురు కాల్పులు జరిపిన మొదటి వ్యక్తి 'ఆరిక రెంజిమ్'. ఈ విషయాన్ని రచయిత ఛాయారాజ్ ఇలా వ్యక్తం చేశారు.

"తొలిసారి తుపాకీ ఎత్తిన
ఆరిక రెంజిం ఆత్మరక్షణ యుద్ధంలో
ఆహుతైపోయాడు ......................"(శ్రీకాకుళం ఉద్యమ కావ్యం :పుట - 85.)

'శివసాగర్'గా ప్రసిద్ధుడైన సత్యమూర్తి అనునతడు పోలీసు ఎన్‌కౌంటర్‌లో మరణించిన 'రెంజిమ్' పేరుతోనే 'చెల్లీ చంద్రమ్మ' అనే రచన చేశాడు. ఈ కావ్యం వరంగల్లులోని కాకతీయ యూనివర్సిటీ ప్రాంత విద్యార్థుల పాఠ్యాంశంగా కూడా ఉంది.

**7. మేడిద సత్యం :**

శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటం జరుగుటకు ప్రధాన కారకుల్లో ముఖ్యుడైన వ్యక్తి భూస్వామి మేడిద సత్యం. ఇతను గిరిజన రైతులకు అప్పులిచ్చి దొంగనోట్లు రాయించి వారి నుండి భూముల్ని కాజేసి గిరిజనుల చేత వెట్టిచాకిరి చేయించుకోవటం వంటి దుర్మార్గమైన పనులు చేయించు కున్న వ్యక్తి మేడిద సత్యం.

రచయిత అతని స్వభావాన్ని ఉన్నది ఉన్నట్లు అద్భుతంగా శ్రీకాకుళం కావ్యంలో వర్ణించాడు. శ్రీకాకుళ పోరాటం అతివాద హింసాయుత పంథాలో నడవడానికి ప్రధాన ప్రేరకుడు, కారకుడు ఈ మోతుబరి మేడిద సత్యం. చివరకు ఈ పోరాటంలో రక్తపు జల్లులు చిందించి శ్రీకాకుళ గిరిజనుల్ని వారి పోరాట పంథాన్ని సర్వనాశనం చేసిన హింసావాది మేడిద సత్యం. ఆఖరికి నక్సలైట్ల చేతుల్లో బలైపోయాడు.

**8. జాత్తు ఉమాపతి :**

సాయుధ పోరాటంలో పాల్గొంటూనే దళాల్లో అక్షరాభ్యసనం చేస్తూ, తక్కువ కాలంలోనే స్పష్టమైన రాజకీయావగాహనతో రాసిన -

"ఆకలితో అర్ధాకలితో
అణగారిన అన్నదమ్ములు
సాయుధులై వర్గ ద్వేషము
చూపించిరి భారతభువిలో ............"(శ్రీకాకుళం ఉద్యమ కావ్యం: పుట - 240.)

ఈ గేయం విప్లవ కార్యకర్తల్లో అవగాహనను, ఆలోచనను కలిగించింది, ఆశ్చర్యానికి గురిచేసింది. ఇలా ఒక ప్రక్క రచనలతో మరో ప్రక్క పోరాటంలో మునిగి వున్న ఉమాపతిని పోలీసులు జీడి తోటల్లో చెట్టుకు కట్టి దారుణంగా కాల్చి చంపేశారు.

**9. హేమచంద్ర పాణిగ్రాహి :**

సోంపేట గ్రామస్థుడైన హేమచంద్ర పాణిగ్రాహి తన అన్నయైన పూజారి సుబ్బారావు ప్రోత్సాహంతో విప్లవ రాజకీయాలపట్ల ఆకర్షితుడై పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటూ ఉండేవాడు. సుబ్బారావు పాణిగ్రాహి రచించి ప్రదర్శించిన జముకుల కథలో ఒక పాత్రధారిగా పాల్గొనేవాడు.

ఈ ఉద్యమంలో ఇంకా చాగంటి భాస్కరరావు, డాక్టర్ దేవినేని మల్లిక్, ఒయిక నారాయణ, ఆరిక సోములు, చంద్రసాహు, కంచరావు, కృష్ణమూర్తి, గేదెల లోకనాథం, నిరంజన్, లింగన్న రాముడు, బున్నయి, లక్నారు మున్నగు వారందరూ పాత్రలుగా ఉన్నారు. వీరందరూ శ్రీకాకుళం లోని పలు గిరిజన ప్రాంతాల్లో బాల సంఘాలు, రైతు సంఘాలు, కూలీల సంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు ఇలా వివిధ రకాలైన సంఘాల్ని అటు గిరిజన ప్రాంతాల్లోను, ఇటు మైదాన ప్రాంతాల్లోను కూడా నడుపుతూ శ్రీకాకుళ పోరాటంలో అమరులైనారు.

ఆధార గ్రంథాలు:

16. శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం - డాక్టర్ కె. ముత్యం.
19. శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటం - డా॥ మానేపల్లి సత్యనారాయణ.
20. శ్రీకాకుళం (దీర్ఘ కావ్యం) - ఛాయరాజ్, జనసాహితి ప్రచురణ- 1989.
21. సాహిత్యోద్యమ పతాక గురజాడ (వ్యాసాలు) - ఛాయరాజ్, జనసాహితి ప్రచురణ - 2012.

పత్రికలు :

1. ఉపాధ్యాయ - మాస పత్రిక - జూలై 2014.
2. ప్రజాసాహితి - మాసపత్రిక - అక్టోబరు 2013.

-0-0-0-